

# భారతి

## పాలడుగు వెంకటేశ్వరరావు

ఆకాశం చిల్లు పడినట్లుగా - కుండల్తో కుమ్మరించినట్లు వాన పడుతోంది. వంటగదిలో మండని కట్టెల్తో, పొగతో అవస్తపడుతోంది మంగమ్మగారు. నీరజ ఇంకా నిద్ర లేచినట్లు లేదు. వాసు రెండు దినాల క్రితం ఫ్రెండు పెళ్ళికని పాలకొల్లు వెళ్ళినవాడు ఇంకా తిరిగి రాలేదు.

పైన కప్పునించి కార్తున్న వర్షపుధారలు ఇల్లంతా తడిపేయకుండా పళ్లేలూ, బిందెలూ పెట్టి – తమ్ముడు వాసు చొక్కాకి వూడిపోయిన గుండీల్ను తిరిగి కుట్టటానికి ముందు వరండాలో కూర్చుంది భారతి.

ప్రపంచాన్ని తెల్లటి ముసుగు కప్పేసింది. అస్పష్టమయిన అయోమయం అలముకుంది. కాస్సేపు అయ్యాక వాన ప్రతాపం తగ్గింది. కాని సన్నని చినుకులు ఎడతెగకుండా రాల్తూనే ఉన్నాయి.

తెల్లవారగట్లనే మెలకువ వచ్చింది భారతికి తలంటి స్నానంచేసి మెత్తటి పంకీల జుట్టుని పైపైన దువ్వుకుంది, భారతి – ఈ లోపల నిద్రలేచి, ఇంటి పనుల్లో చొరబడిన మంగమ్మగారికి సాయం చెయ్యబోయింది.

'ఇవన్నీ నీకెందుకు లేవే! ఆఫీసు పని మిగిలిందని నిన్న ఏవో ఫైళ్ళు తెచ్చుకున్నావు గదా! పోయి ముందు గదిలో కూర్చుని ఆ పని చూసుకో.' అంది మంగమ్మగారు మురిపెంగా చూసి. భారతి నవ్వుకుని ఫైళ్ళు చూసుకోబోయింది. కాని–నిలకడ కుదరలేదు.

మనసు గుర్రమువంటిది-పరుగులు తీసింది. బుద్ధిని నిలవనీయలేదు. ఆలోచనలు చేతులకి సంకెళ్ళు వేయగా ఫైళ్ళు తీసి అవతల పెట్టింది. అసహనంగా ఇల్లంతా అటూ ఇటూ కలయదిరిగింది. కాలు నిలవలేదు ఆ పనీ ఈ పనీ చెయ్యబోయింది. చెయ్యలేదు.

భారతీ, సుందరీ ఆఫీసులో కొలీగ్స్, మంచి స్నేహితులు.

విశ్వం సుందరికి చిన్నన్న. మద్రాసులో ఏదో మంచి కంపెనీలో పెద్ద ఆఫీసరుగా ఉద్యోగిస్తున్నాడట వూరుగాని వూరులో-గారాల చిన్నకొడుకు ఒంటరిగా ఇబ్బంది పడటం తల్లిదండ్రులకు ఏమాత్రం ఇష్టంలేక - వెంటనే వచ్చేసి-మంచి లగ్నాలున్నాయి గనక-నీకు నచ్చిన అమ్మాయిని నీ ఇష్ట ప్రకారమే ఎన్నుకుని పెళ్ళి చేసుకుని వెడతావా లేక మమ్మల్ని సత్యాగ్రహం చేసి ప్రాయశ్చిత్తం చేసుకోమంటావా–అని తల్లీ తండ్రీ పదే పదే నిష్ఠూరంగా వుత్తరాలు రాయగా-సర్లెమ్మని వచ్చి-మధ్యలో చెల్లెల్నీ బావమర్దినీ కూడా చూసి నాలుగు రోజులుండి పోదామని ఈ వూరు వచ్చాడని సుందరి అతని గురించి చెప్పింది. మొదటి పరిచయంలోనే అతని పెదాలమీది నవ్వులోని విశేషాన్ని గమనించింది భారతి. అతని కళ్ళు భారతికి ఏదో చెప్పాలని ప్రయత్నించాయి. కాని భారతి పట్టించుకొనలేదు.

ఆ తర్వాతి రోజున సుందరి రాయబారం తెచ్చింది.

'చిన్నన్నయ్య నిన్ను పిల్చుకు రమ్మన్నాడు. 'త్వరగా తయారవు తరుణీమణీ.'

'నాతో అతనికేం పని?'-అని చిరుకోపం ప్రదర్శించింది భారతి.

'ఏమో నాకేం తెల్సు? వచ్చి అతన్నే అడగరాదా?' కొంటెగా నవ్వింది సుందరి. మొదటిసారిగా సిగ్గుపడింది భారతి.

'క్లియోపాత్రా తెల్సు గదా!'

'ఊఁ'

'తన వాల్చూపులతో సామ్రాజ్యాధిపతులనే బంధించింది.

'సర్లె. సర్లె.'

'అలా ఏం తెలియనట్లు మాట్లాడకు. నా ఉద్దేశ్యంలో, నీ వాల్చూపులు అంతకంటె శక్తిమంతమయినవి. చాలా చాలా గొప్పవి.'

'అబ్బ! ఇక చాల్లేవే, సుందరీ.'

'మరి ఏమయిందో ఏమో! నిన్ను పరిచయం చేసిన ఆ క్షణం నుంచీ మా అన్న నిద్రాహారాలు మాని చిక్కి సగమయ్యాడు 'పాపం నీదే సుమా'

'ఇక వూరుకో తల్లీ! ఎవరన్నా వింటారూ. బాగుండదు.'

'ఎవరూ వినకపోతే ఫర్వాలేదన్నమాట! అయితే మా ఇంటికి రా. మా శ్రీవారు కేంపుకి వెళ్ళి వున్నారు. తీరిగ్గా కూర్చుని భయం లేకుండా మాట్లాడుకుందాం, మనం మనం'

'నేను రాను ఫో. కొంటె మాటలూ నువ్వూ'

'అలా ఫో ఫో-అంటే పోయేదాన్ని కాదమ్మా. బంగారుబొమ్మవంటి అందాల వదినగార్ని అంత తేలిగ్గా వదిలిపెట్టేదాన్ని కాను నేను. నేనసలే మొండిని.'

'అబ్బ! నిన్ను పొమ్మనలేదే నేనూ. సారీ'

'అలాగా! నువ్వు మాట్లాడుతున్నది తెలుగులో కాదా? నేను ఆ యొక్క భాష ఎరుగక అపార్థం చేసుకున్నందుకు నన్ను క్షమించు హలా! ప్రియ సఖీ-నా అనుంగు చెచ్చెలీ'

సిగ్గుల మొగ్గ అయి చేతుల్తో మొహం కప్పుకుంది భారతి.

'అయితే నువ్వు రావన్నమాటేగా?'

'వుహూఁ' తల అడ్డంగా వూపింది భారతి.

'నిన్ను ఇలా కాదులే. మొండివి. అందగాడు, మంచి ఉద్యోగంలో వున్నాడు. కావాలని నిన్ను కోరుకున్నాడు. మంచి మనసున్న మనిషి మా చిన్నన్న. నాకు తెలీక అడుగుతానూ ఎందుకే నీకు ఆ బెట్టు?! నామీద నమ్మకం లేదా? చిన్నన్న కోరికని మావాళ్ళు కాదనరు తెలుసా?'

'భారతి కళ్ళవెంట నీళ్ళు తిరిగాయి. అవ్యక్తమయిన అనుభూతికి లోనయింది.

'పిచ్చి! ఎందుకే ఆ కన్నీళ్ళు?! ఆనంద బాష్పాలా! సర్లే. నన్ను నమ్ము మరి'

'సుందరీ! నీవు మంచి స్నేహితురాలివి. నా మంచిని కోరుకునే మనసున్న దానివి. నిన్ను కాక మరెవర్ని నమ్మను?'

'నీ మాటల్ని నేనూ నమ్ముతానులే. నీకు శుభమే జరుగుతుంది. సంతోషంగా వుండు. వెళ్ళొస్తానూ. మళ్ళీ కలుద్దాం త్వరలోనే'

వీధివరకూ వెళ్ళి సుందరిని సాగనంపింది భారతి.

అది జరిగిన నాలుగు దినాల్నుండీ భారతి మనసు గుర్రంలాగా పరుగులు తీస్తూ వుంది. నిలకడ లేకుండా ఆందోళనతో పరుగులు తీస్తున్నది. సతమతమవుతున్నది.

నిన్న సాయంత్రం ఆఫీసునుంచి అలిసిపోయి ఇల్లు చేరిన భారతికి ప్రసన్న వదనంతో కాఫీ అందించింది తల్లి మంగమ్మ. చదువుతూ వున్న పేపర్ని అవతల పడేసి వచ్చి ప్రక్కన కూర్చున్నాడు తండ్రి, తిరుమలరావుగారు.

'నీతో ఒక మంచి సంగతి ప్రస్తావిద్దా మనుకుంటున్నానమ్మా'

'ఏమిటి నాన్నగారూ?'

'కుర్రవాడు మంచివాడు. మంచి ఉద్యోగంలో వున్నాడు. అందగాడు కూడా. నిన్ను అతను ఎరుగునట. పెళ్ళి చేసుకుంటానని ముందుకు వచ్చాడు. మీ కాలేజ్ సుందరిద్వారా అతను నీకూ తెలుసునట గదా! మనం సరేనంటే అతను వెళ్ళి తల్లిదండ్రుల్ని తీసుకుని వచ్చి మాట్లాడతానన్నాడు. కట్నకానుకలు అసలు అక్కర్లేదుట! తల్లీ! అదృష్టదేవత వచ్చి మన తలుపు తట్టింది. వెంటనే అలాగే అందామనుకున్నాను. కాని - నిన్ను కూడా ఒక మాట అడిగి చెపుతానన్నాను. నిన్న లైబ్రరీలో ఒక గంటపైగా అతన్తో మాట్లాడాను. నాకు ఈ సంబంధం అన్ని విధాలా నచ్చింది. ఏ సంగతి తెల్సుకొనటాన్కి రేపు ఉదయం విశ్వం మన ఇంటికి వస్తానన్నాడు' ఆనందంతో చెప్పుకుపోతూ ఆయాసంతో ఆగారు తిరుమలరావుగారు.

సంతోషంతో కళ్ళు అంతలేసి చేసుకుని వింటూంది మంగమ్మగారు.

భారతి మౌనంగా ఉండిపోయింది.

'నీ అభిప్రాయం కూడా చెప్తే - నువ్వు సరేనంటే సంతోషించి, ఆ తర్వాత కార్యక్రమం ఆలోచిస్తాము. ఎదిగిన ఆడపడుచు పెళ్ళి - కన్నవాళ్ళ సమస్య — నీకు తెలీనిదేముంది?'

'సరేననక ఏమంటుందిలెండి.' ఆనందంగా అంది మంగమ్మగారు.

'కాదు. ఇటువంటి విషయాలలో స్పష్టంగా వుండాలి. ఇది అమ్మాయి జీవితానికి సంబంధించిన సమస్య. ఆలోచించే చెప్పనీ' అన్నారు తండ్రి.

'నాన్నగారూ! ఇది మన అందరి జీవితాలకీ సంబంధించిన సమస్యండీ'- అని లేచి లోపలకి వెళ్ళింది భారతి, భారంగా నిట్టూరుస్తూ.

'ఏమిటే! అమ్మాయి అలా అంటుందేమిటి?!'-ఆందోళనగా అన్నారు తిరుమలరావు.

'మీ చాదస్తంగాని - ఆడపిల్ల అంతకంటె ఎక్కువగా ఏమి చెప్తుంది?' అంది మంగమ్మగారు.

నీరజకి చిన్నప్పుడే పోలియో వచ్చింది. వైద్యానికని చాలా డబ్బు తగలేసి చాలా వూళ్లు తిరగటాన్కి తిరుమలరావుగార్కి — రిటయిరయినాక అందిన గ్రాట్యుయిటీ డబ్బు చాలక అప్పులయినాయి. ఇల్లు తాకట్టులో వుంది. వాసు అందరికంటె ఆఖర్న పుట్టినవాడు. ఇంటర్మీడియెట్ ఈ సంవత్సరం అయిపోతుంది. పై ఏడాది — మెడిసిన్‌లో చేరాలనుకుంటున్నాడు. మెరిట్‌తో సీటు సంపాదించుకున్నా — చదువు కొనసాగటాన్కి డబ్బు కావాలి. ఆ కుటుంబానికి ఏకైక ఆధారం ఇప్పుడు భారతి ఉద్యోగించి తెస్తున్న జీతం. అన్నీ బాగానే వున్నా - ఈ రోజుల్లో - ఆడపిల్లకి పెళ్ళి చెయ్యటం ఒక యజ్ఞం చేసినంత వ్యయప్రయాసలు తగ్గటం లేదు. అటువంటిది నీరజ పెళ్ళి ఆ కుటుంబానికి పెద్ద గుదిబండలాగా అవదని చెప్పటం కష్టం. ఇవన్నీ అర్థంకాని వయసు కాదు భారతిది.

కిర్రున గేటు తీసిన చప్పుడయింది. చేస్తున్న పని ఆపి అటు చూసింది భారతి. గుండె ఝల్లుమనింది. గండుమీనుల్లాగ ఆమె కనులు అల్లల్లాడాయి.

వానలో తడుస్తూ - లోపలకి రావటాన్కి సంశయిస్తూ - విశ్వం!

భారతి లేచి నిలబడి—'రండి'-సంభ్రమంగా అతన్ని ఆహ్వానించింది-తల తుడుచుకోవటాన్కి తువాలందించి — 'వానలో తడిశారు! అంది. విశ్వం చిరునవ్వు నవ్వాడు. అది భారతి గుండె లోతుల్ని కోసింది. విలవిల్లాడింది దెబ్బ తిన్న పక్షిలాగ భారతి.

'మిమ్మల్ని చూడకుండా వుండలేకపోయాను. మీకోసం ఈ వర్షాన్నే కాదు - దేనినీ లెక్క చెయ్యాలనిపించటం లేదు.' మనమోహనంగా నవ్వాడు విశ్వం.

'భారతీ! సుందరి మీకు అన్నీ చెప్పే వుంటుంది. మీ నాన్నగారు కూడా ఆ ప్రస్తావన మీ దగ్గర తెచ్చివుండాలి. మీ నిర్ణయాన్ని విని — ఆ కబురు ఆనందంతో మా వాళ్ళకి మోసుకుని పోవాలని కొండంత ఆశతో వచ్చాను, ఈ వర్షంలో....'

అతని వాక్ప్రవాహం ఆగేటట్టు లేదు, గుండె విప్పి ఎన్నో సంగతులు పరిచాడు.

ఆరాధన, విశ్వాసంతో కూడిన అతని మాటలకి భారతి కళ్ళు చెమర్చాయి.

లోపలికి వెళ్ళి కాఫీ తెచ్చి అందించింది - అతనికి.

'నా జీవితంలో నేను తాగిన చాలా మంచి కాఫీ ఇది' అన్నాడు. అదే విధమయిన నవ్వు నవ్వి. భారతీ నవ్వింది.

# మేఘగీతం

## మైత్రి

మౌనమే ధ్యానమైన
నీలగగన ప్రాంగణాన
ఏముందని చరియింతువు
దేనికొఱకు తపియింతువు
జాలికనుల మేఘమా
ఆవిరి స్వరగీతమా ॥మౌనమే॥

కలదే ఏదేని అచట
కలగీతుల ఎలకోయిల
కలదే ఏదేని అచట
పూలుకూర్చిన తూగుటూయెల
కలదే చెలికౌగిలి
కలదే తొలిపలపుల గిలి
కలదే కమకమ్మగ మాటలాడు జాబిలి
కలదుగాని పుడమిపై... ॥మౌనమే॥

కలదే ఏదేని కాంతి
కలదే ఏదేని క్రాంతి
కలదే నీ గుండెలకు
హరితకిరణ సంక్రాంతి
కలదే ఒక నిముషమైన
నీ నడకకు విశ్రాంతి
కలదుగాని పుడమిపై ॥మౌనమే॥

నింగిలోనె మిగిలిపోవ
నీ జన్మకు సాఫల్యమెచ్చోట
నేలపై నువు నడయాడిన
నిను కొలవని గుడి ఎచ్చట
చినుకై కురిసి పంటకు ప్రాణంకావే
వేసవి గుండెకు రవంత బాసటకావే

# ప్రతిబింబం

## శంకరయ్య

గాజు కళ్ళ వినీలచ్ఛాయావరణంలో
అనుభవాల తాయాకు పగుళ్ళ నెగళ్ళు.
అమృతాభిషేకాన్ని కాంక్షిస్తూ
ప్రపంచ కూపం నుండి చేదుకుంటున్న
చూపుల బొక్కెన నిండా
హృచ్ఛకలాలు తేలే రక్తాశ్రుపూరం.
కదిలే పెదాల గుహా ముఖాల చీకట్లో
నిబద్ధవర్ణచిత్రాల గుసగుసలు,
ఆత్మన్యూనతా పరిధిలో
లయలేని
విలయోన్ముఖ పద ఘట్టనల ఫిరంగుల మోతలు.
గుండె గూడులో కునుకు తీస్తున్న
ఆశాబుద్బుదాల విస్ఫోటనా వికట ధ్వనులు.
ముళ్ళచేతులు పువ్వుల్ని రువ్వవు.
ఈ లోకం దర్పణంలో
ముక్కలై ఏడుస్తున్న ప్రతిబింబాన్ని చూచి
భయపడితే ఎలా?...... అది నీదే!

# ధీమా

## రఘువర్మ

విధి ఎప్పుడూ
నాకు ఇస్తూంటుంది
నిరాశా విషం!
పైగా చేస్తూంటుంది
వికటాట్టహాసం!
కానీ... పాపం

దానికి తెలియదు కాబోలు
నేను ఆశామృతాన్ని
త్రాగేవాణ్ణని-
అందుకే చిరంజీవిగా
బ్రతుకుతున్నానని !!!

'నాన్నగారు ఇంట్లో వున్నారా?'

'వస్తారు. బజారు వెళ్ళారండి, అమ్మ.

'నాన్నగారు వచ్చేలోగా మీ నిర్ణయం చెప్పి నన్ను కృతార్థుణ్ణి చెయ్యండి. ప్లీజ్! భారతీ'

'భారతి మౌనంగా తల వంచుకుంది.

'సారీ విశ్వంగారూ! నా మీద మీకు ఏర్పడిన సదభిప్రాయానికి చాలా థాంక్స్. కానీ ఇది నా జీవితానికి సంబంధించిన విషయం. కనుక నా ఆలోచనలు నాకుంటాయి. అందువలన మీరు నన్ను క్షమించి – మీ హృదయంలో నాకు కేవలం ఒక స్నేహితురాలిగా చోటివ్వండి. నాకు అది చాలు' అంది అతి ప్రయత్నం మీద.

విశ్వం మొహం తెల్లగా అయింది—రక్తం తోడేసినట్టు.

'భారతీ! ఇదే మీ నిర్ణయమా?! బాగా ఆలోచించే చెప్పండి. తొందర లేదు....'

భారతి నవ్వి తల వూగించింది, పైకీ క్రిందికీ. అతను చాలాసేపు తల వంచుకుని కూర్చున్నాడు. 'థాంక్సండీ. మరి నేను వెళ్ళి వస్తాను. గుడ్‌లక్'— అతను లేచి గబగబ బయటికి నడిచాడు. అతని అడుగుల్లో తడబాటు. ఆశాభంగం అందించిన అలజడి .

శిలావిగ్రహంలాగ నిలబడి—వెళ్ళిపోతున్న విశ్వాన్నే చూస్తున్న-భారతి కళ్ళల్లో వరదలు. తుఫానుకి గురయిన సముద్రపు కెరటాల హోరు. అగ్నిపర్వతాల సెగలు.

వర్షం విజృంభించి జోరున కురవసాగింది. బజార్నుంచి, రాబోయే అతిథి కోసం స్వీట్సూ, పళ్ళూ తీసుకుని అప్పుడే ఇల్లు చేరిన తిరుమలరావుకి-తల వంచుకుని వడివడిగా తనని గమనించకుండానే...చరచరా సాగిపోతూ వున్న విశ్వం ప్రవర్తన ఆశ్చర్యం కలిగించింది.

క్రూరంగా ఆకాశం వురిమింది ఆ గర్జనల ఘట్టనల్ని తట్టుకొనే ప్రయత్నంలో గుండెల్ని అదిమి పట్టుకుని కుర్చీలో వాలిపోయి మవునంగా శోకించింది, భారతి.